క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ కృష్ణానాయక్

మునగాల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తెలంగాణ మైనార్టీ ఉద్యోగుల సంఘం (టీఎస్ ఎంఈఎస్ఏ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ జి.కృష్ణానాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హేమలత, ఆర్ఐ రాధారెడ్డి, టీఎస్ మీసా జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ అబ్దుల్‌సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

24న రేషన్‌డీలర్ల నియామక అర్హత పరీక్ష

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న రేషన్‌డీలర్ల నియామకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పట్టణంలోని టౌన్‌హాల్లో ఈనెల 24న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్డీఓ వెంకారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఉదయం 11నుంచి 12.30గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు, అభ్యర్థులు నిర్ణీత సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల నుంచి హాల్ టికెట్లను పొందాలని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో వయో వృద్ధుల నూతన కార్యవర్గాన్ని సీనియర్ సిటీజన్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గార్లపాటి జగన్‌రెడ్డి, పెన్‌పహాడ్ మండల శాఖ అధ్యక్షుడు రంగినేని లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా బచ్చు నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా పిట్టల రాజలింగం, కార్యదర్శిగా నందిపాటి గురువయ్య, సహాయ కార్యదర్శిగా కటికం రామయ్య, కోశాధికారిగా బట్టిపల్లి లక్ష్మి, గౌరవ సభ్యులుగా గండికోట ఎల్లమ్మ, కీత భిక్షమయ్య, పందిరి రంగయ్య, బత్తిని గోపయ్య, వట్టిపెల్లి భిక్షం, సుందరి సత్యనారాయణ తదితరులను ఎన్నుకున్నారు.

సహారా బాధితులను ఆదుకోవాలి

నడిగూడెం : సహారాలో నగదు డిపాజిట్లు చేసిన మండల బాధితులను ఆదుకోవాలని మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జలీల్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆ సంస్థలో నగదు డిపాజిట్లు చేశారని అన్నారు. తీరా ఆ డబ్బు బాధితులకు చెల్లించకపోవడంతో బాధితులు ఆందోళనలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలి



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

మఠంపల్లి : ప్రభుత్వం మునుగోడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా యాదవ, కురుమలకు గొర్రెలకు బదులుగా నగదు బదిలీ చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. శనివారం మండలంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గొర్రెల పంపిణీలో గతంలో జరిగిన దళారీల విధానానికి స్వస్తి పలికి నగదు బదిలీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,39,980మంది సొసైటీ సభ్యులకు గ్రౌండింగ్ చేయాల్సిఉందన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, యాదవ సంఘం నాయకులు కొండా అంజయ్య తదితరులున్నారు.

కుటుంబానికి పరామర్శ

అనంతగిరి : మండలంలోని వాయిలసింగారం గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం సభ్యుడు సంపంగుల రమేష్ (30) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ సంఘం చైర్మన్ కంటు నాగార్జున శనివారం రమేష్ మృతదేహానికి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సంఘం సభ్యులు గొడుగు వీరయ్య, కంటు వెంకటేశ్వర్లు, అంకర్ల జయరామయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఫెన్సింగ్ వైర్ చోరీ

మునగాల : మండల పరిధిలోని రేపాల గ్రామ శివారులో గల వైకుంఠధామం చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు సర్పంచ్ పల్లి రమణ శనివారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కబ్జా కోరల్లో వాగులు

- ఆక్రమణలకు గురైన రావిపహాడ్ నుంచి గుండ్లచెర్వుకు వెళ్లే వాగు
- చోద్యం చూస్తున్న అధికారులు

మోతె : ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు అక్రమార్కులు కబ్జాలు పెడుతున్నారు. చివరికి వాగులను కూడా వదలకుండా వాగు వెంట భూములు ఉన్న రైతులు మట్టి పోయి చదును చేసి కబ్జా చేసి వరిసాగు చేస్తున్నారు. దీంతో వాగులు ఆనవాలు లేకుండా పోతున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఎక్కడ వీలుంటే అక్కడే కబ్జా చేసేందుకు అక్రమార్కులు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల పరిధిలో పొలాల మధ్య ఏర్పడిన ఈ వాగులే రైతుల భూముల సేద్యానికి జీవనాధారంగా ఉండేది. వానా కాలమైనా ఎండా కాలమైనా నిత్యం నీరుపారే ఈ వనరులు కాలంతో పాటు తమ రూపాన్ని కోల్పోతున్నాయి. వంద మీటర్లకు పైగా విస్తరించి ఉన్న ఈ వాగులు కాస్తా ఇప్పుడు 10, 15మీటర్లకు కుదించుకుపోతున్నాయి. కళ్ల ఎదుటే ఆక్రమణలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. మోతె మండలంలోని రావిపహాడ్ పెద్ద చెర్వు, విభళాపురం గండ్లచెర్వు గొలుసు కట్టు చెర్వులు. ఈ చెర్వుల మధ్య పారే వాగునీటిపై ఆధారపడి రావిపహాడ్, బుర్కచర్ల, హుస్సేన్‌బాద్, విభళాపురం, మామిళ్లగూడెం, గోపాలపురం, సింగరేణిపల్లి గ్రామాలకు చెందిన వేలాది మంది రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు.



బుర్కచర్ల బ్రిడ్జి వద్ద కబ్జా చేసి వరిసాగు చేసిన ఆక్రమణదారులు

మండలానికి పైన ఉన్న ఆత్మకూర్(ఎస్) మండలంలో చెర్వులు నిండితే రావిపహాడ్ పెద్ద చెర్వుకు వాగు ద్వారా వరద చేరుతుంది. మండలంలో సుమారుగా 15కిమీపైగా విస్తరించి ఉన్న రావిపహాడ్, గండ్ల చెర్వులు వాగులు ప్రస్తుతం ఆక్రమణదారుల కబ్జాలో కూరుకుపోయాయి.

ఇష్టారాజ్యంగా ఆక్రమణలు..

అదే విధంగా రావిపహాడ్, బుర్కచర్ల, హుస్సేన్ బాద్, రాంపురంతండా, విభళాపురం, మామిళ్లగూడెం, కొత్తగూడెం గ్రామాల పరిధిలోని వాగులను భారీగా ఆక్రమించారు. వాగు పక్కనే భూములున్న రైతులు వాగులను మట్టితో నింపి చదును చేసి వారి భూముల్లో కలుపుకుంటున్నారు. ఇంకొందరు వాగుల్లో మట్టిని తోడి తమ వ్యాపారాలకు వాడుకొంటున్నారు. వాగుల పక్కన భూములను కొనుగోలు చేసిన రైతులు స్థిరాస్తి వ్యాపారులు ఏకంగా వాగుల్లోనే బావులు తవ్వుతున్నారు. వాగుల్లో మట్టి నింపి సేద్యం చేసుకోవడంతో వరదలు వచ్చినప్పుడు పక్కనే ఉన్న సేద్యపు భూములు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉంది. వాగుల ఆక్రమణలు ఇష్టారాజ్యంగా సాగుతున్నా రెవెన్యూ యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుందని ఆరోపణ వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని వాగులు ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఆయా గ్రామాల పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

గ్రామాల్లోని ప్రభుత్వ భూ ములైన వాగులు, చెరువులు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఖాళీగా ఉన్న ప్రభుత్వ గు ట్టలు, బంచరాయి, ఎస్సారెస్పీ కాల్వల వెంట ఉన్న ఖాళీ భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. వాటిలో ఎటువంటి ఆక్రమణలు చేపట్టినా చర్యలు తప్పవు.

- పి.యాదగిరి, తహసీల్దార్, మోతె



వాగును చదును చేసి ఆక్రమించిన రైతులు

‘మైహోం’ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం



మఠంపల్లి : వైద్యశిబిరం ప్రారంభంలో పాల్గొన్న మైహోం ప్రతినిధులు, జిల్లా పశువైద్యాధికారులు



కోదాడరూరల్ : పాడిరైతులకు మందులు అందజేస్తున్న సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లి పశువైద్యశాలలో స్థానిక మైహోం సిమెంట్స్ పరిశ్రమ సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని పరిశ్రమ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా పశువైద్యాధికారి డి.శ్రీనివాసరావు, సర్పంచ్ కృష్ణవేణినరేష్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు.. ఉచిత పశువైద్యశిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మైహోం సిమెంట్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 367 పశువులకు చికిత్సలు చేసి, 2929 జీవాలకు మందులు పంపిణీ చేశారు. సుమారు రూ.80వేల మందులు మైహోం సిమెంట్స్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కె.లక్ష్మీవెంకటనారాయణ, ఉపసర్పంచ్ ఆదిలక్ష్మీనాగిరెడ్డి, పరిశ్రమ అధికారులు జగన్నాథరావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, శ్రీహరి, పశువైద్యాధికారులు డాక్టర్లు ఉషారాణి, వీరారెడ్డి, రమేష్, శంకర్, శ్రీనివాసరెడ్డి, మధు, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడరూరల్ : గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రవరం సర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని ఎర్రవరం గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతులు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలతో ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా 60గేదెలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి నాగేంద్రబాబు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఉద్దండు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సురేంద్ర, శరత్, హుస్సేన్, నాగయ్య, కోదండరావు, వెంకటయ్య, నాగులుమీరా, కోటేశ్వరావు, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతో మెరుగైన అభివృద్ధి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో అందరి సహకారంతో మెరుగైన అభివృద్ధిని సాధిస్తామని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మఠంపల్లి మండలానికి చెందిన మాజీ సర్పంచ్ బచ్చలకూరి రజిత, చెడపంగు ప్రేమ్‌సాగర్ శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అభివృద్ధి మాత్రమే ఇతర పార్టీల నాయకులను బీఆర్ఎస్ పార్టీ వైపు అడుగులు వేయిస్తున్నాయని అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపై గ్లోబల్ ప్రచారాలను ప్రజలు నమ్మరని ఆయన అన్నారు.



పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్‌లో సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మన్యం శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, శంకర్, సైదయ్య, మట్టపల్లి, సైదయ్య, ఇమ్మానుయేల్ తదితరులు ఉన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఎలక బిందు అధ్యక్షత నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత ఎమ్మెల్యేను ఎంపీపీ దంపతులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరికి ఉపయోగపడే విధంగా చొరవ తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తర్వాత పల్లెలన్ని ప్రగతిపథంలో పయనిస్తున్నాయన్నారు. గ్రామాల్లో గుణాత్మక మార్పు కోసం సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. గ్రామాల్లో అధికారులు సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. అధికారులు ప్రజాప్రతినిధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జి.కృష్ణనాయక్, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జయబాబు

నేరేడుచర్ల : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 5వ వార్డులో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతిఒక్కరికి కంటి దోష నివారణ కోసం ప్రతిష్టాత్మకంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న ప్రతిఒక్కరికి ఉచితంగా మందులు, కళ్ల అద్దాలు అందించడంతో పాటు అవసరం ఉన్న వారికి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట వైద్యాధికారిణి నాగిని, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ శ్యాంసుందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి : మండలంలోని ఖాళీగా ఉన్న 127వార్డులు, రెండు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని ఉల్లంగించారని 2020లో మండలంలోని 127 వార్డులు, రెండు ఎంపీటీసీలను పదవుల నుంచి తొలగించి మూడేళ్ల అవుతున్నా ఇప్పటికీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామాల్లో వార్డుసభ్యులు లేకపోవడంతో సర్పంచ్‌లు తీసుకునే నిర్ణయాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లింగరాజు, ఎలమంద, కాశీ, వెంకటేష్, యాదగిరి, జగన్, రాజు, సైదులు, అచ్చమ్మ, సోమయ్య తదితరులున్నారు.

నియామకపత్రం అందజేత



వెంకన్నగౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

మోతె : మండలంలోని రాఘవాపురం ఎక్స్‌రోడ్డు గ్రామంలో శనివారం గౌడ జన హక్కుల పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన కేసాని వెంకన్నగౌడ్‌కు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యేలికట్టి విజయకుమార్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి నారాయణగౌడ్ శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్నగౌడ్ మాట్లాడుతూ.. గౌడ జన హక్కుల పోరాట సమితి బలోపేతానికి కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు కారింగుల శ్రీనివాస్, సంఘం మండల అధ్యక్షుడు మామిడి సీతారాముగౌడ్, అఖిలభారత గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమగాని సోమేష్‌గౌడ్, చొగోని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బత్తిని వెంకటేశంగౌడ్, మల్లయ్యగౌడ్, జగ్గయ్యగౌడ్, రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండల పరిధిలోని ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం మండలంలోని ఆకుపాముల గ్రామానికి చెందిన విలాసకవి సత్యంరాజు నాల్గవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు విలాసకవి ప్రసాద్‌రాజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుపాముల గ్రామసర్పంచ్ కేశగాని వెంకటేశ్వర్లు, నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ప్రసాద్‌రాజు వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రసాదరాజు మిత్రులు పోలంపల్లి వెంకట్రామయ్య, పోలంపల్లి వెంకటేశ్వర్లు, బక్క నాగేశ్వరరావు, కాసాని వెంకటనారాయణ, సంపెట ఉపేందర్, షేక్ రషీద్, సంపెట కోటేశ్వరరావు, షేక్ నూర్ ఖాన్, లక్ష్మణ్, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ప్రసాదరాజు

ఏకకాలంలో రుణమాఫీ అమలు చేయాలి

హుజూర్‌నగర్ : రైతుల రుణమాఫీ ఏకకాలంలో అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి, కౌలుదారుల సంఘం రాష్ట్ర నాయకుడు దుగ్గి బ్రహ్మ కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం సభ్యత నమోదు కార్యక్రమంలో భాగంగా వారు రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని కోరారు. గతంలో అందించిన విధంగా వ్యవసాయ పరికరాలపై సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు దొడ్డురకం యూరియాను పంపిణీ చేయాలని, సన్న యూరియాను పొలంలో చల్లాలంటే రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పాషా, వీరబాబు, ఆర్.మురళి, పి.వెంకట్‌నారాయణ, వై.సైదులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేయాలి

నడిగూడెం : రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేయాలని పండ్ల తోటల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం రైతు బంధు పథకంతోనే సరిపుచ్చుతుందని, దీంతో సబ్సిడీలపై రావాల్సిన పరికరాలు నిలిపివేయడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు రాయితీపై సాగుకు అవసరమైన పరికరాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ

హుజూర్‌నగర్ : పట్టణంలోని చింతలబజారుకు చెందిన సింగం వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి శనివారం బాధితుడికి కౌన్సిలర్ గుంజ భవాని, యడ్ల విజయ్ ద్వారా 50కేజీల బియ్యం, నగదును పంపించారు. వారి వెంట వి.లక్ష్మయ్య, జి.నాగార్జున, వి.యాదగిరి, జి.వెంకన్న, రమేష్, క్రాంతి, రామకృష్ణ, లక్ష్మి తదితరులు నాయకులు, గ్రామస్తులు తదితరలు ఉన్నారు.

జనచైతన్య ట్రస్ట్ ఆధ్వర్యంలో 50కేజీలు..

పట్టణానికి చెందిన కారింగుల కాశీ తన కూతురు సాయిశరణ్య పుట్టినరోజును పురస్కరించుకుని 50కేజీల బియ్యం అందజేశారు. ఈ బియ్యాన్ని జన చైతన్య ట్రస్ట్ సభ్యులు 15వ వార్డుకు చెందిన కుంభం కాటయ్య వీరమ్మ కుటుంబానికి 25కేజీలు, 13వవార్డుకు చెందిన కస్తాల పెంటమ్మకు 25కేజీల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వంశీ, సాయి, శివశంకర్, రమేష్, అహ్మద్, నాగిరెడ్డి, సాయి, ఉపేందర్, బాబురావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోదాడ : పట్టణ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పగిళ్ల శేషమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో స్పందించి ఆ నిరుపేద కుటుంబానికి తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెబోయిన అంజియాదవ్ శనివారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కతిమాల వెంకన్న, నవీన్, మల్లేష్, లిక్కి మోహన్ రావు, పట్టుపాక గురవయ్య, ఉపేందర్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న అంజియాదవ్

ప్రతిఒక్కరూ వ్యక్తిగత బీమా కలిగి ఉండాలి

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ వ్యక్తిగత బీమా కలిగిఉండాలని ఎస్‌బీఐ డీజీఎం ప్రశాంత్‌కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన రాపోలు మహేష్ ఇటీవల మృతి చెందాడు. మృతుడు ఎస్‌బీఐలో ఇన్సూరెన్స్ కలిగి ఉండడంతో అతడి భార్య సుమలతకు ఎస్‌బీఐ డీజీఎం ప్రశాంత్‌కుమార్ రూ.20లక్షల ప్రమాద బీమా చెక్కును శనివారం స్థానిక బ్యాంక్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోవిడ్ తరువాత బీమాపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ప్రతిఒక్కరూ రూ.వెయ్యితో వ్యక్తిగత ప్రమాద బీమా ఇన్సూరెన్స్‌లో చేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఎస్‌బీఐ అతితక్కువ డబ్బుతో బీమా సౌకర్యాన్ని అందిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలైన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన వంటి పథకాలు కేవలం రూ.342 చెల్లిస్తే రూ.4లక్షల వరకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్ఎం కృష్ణమోహన్, బ్యాంకు మేనేజర్ ఫణికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య, గోపాలకృష్ణ, ప్రభాకర్, రవి, యాకుబ్, శ్రీను, బ్యాంకు సిబ్బంది తదితరులున్నారు.

విహారయాత్రలతో విజ్ఞానం పెంపొందుతుంది



వెయ్యిస్తంభాల గుడి వద్ద ఉపాధ్యాయులతో విద్యార్థులు

మద్దిరాల : విహారయాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయుడు శివయ్య అన్నారు. విజ్ఞాన విహారయాత్రలో భాగంగా మండల పరిధిలోని చిన్ననెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను శనివారం రామప్ప, లక్నవరం, వెయ్యిస్తంభాల గుడి, వరంగల్ ఖిలా, మేడారం, భద్రకాళి దేవాలయం వంటి చరిత్రాత్మక ప్రాంతాలకు తీసుకెళ్లి వాటి విశిష్టతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాకయ్య, శ్రీనివాస్, హర్రున్, ఉపేందర్‌రెడ్డి, సాల్మన్, ప్రదీప్‌కుమార్, మధూకర్, అవిలయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

కోదాడరూరల్ : మండల పరిధిలోని అశోక్‌నగర్‌లో గల శనగల రాధాకృష్ణ మానసిక దివ్యాంగుల కేంద్రంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ సిలివేరు వెంకటేశ్వర్లు జన్మదినం సందర్భంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాణి, నిర్వాహకులు ఉన్నారు.

దళితులను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్

నేరేడుచర్ల : దళితబంధు పేరుతో తెలంగాణలోని దళితులను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఉట్కూరి సైదులు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో దళిత బంధుకు రూ.17వేల700కోట్లు కేటాయించినప్పటికి నేటి వరకు దళిత బంధు పథకం సక్రమంగా అమలు కాకపోవడం దురదృష్టకరమన్నారు. దళిత బంధు పేరుతో కోట్లు దండుకునేందుకు సీఎం కేసీఆర్ మాయలగారడి చేస్తున్నారని అన్నారు.

సాయిబాబా ఆలయంలో అమావాస్య పూజలు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం ఆవరణలో ఉన్న గంగా పార్వతీ సమేత శివ సాయి దేవాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం త్రిమూర్తులు ఉన్న రావిచెట్టు, వేపచెట్టు, మేడిచెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సవరాల సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు శంకర్ లాల్, బీఆర్ఎస్ నాయకులు శ్రీపాద జానకిరాములు, పూజారులు వలివేటి విశ్వేశ్వర శర్మ, మామిళ్లపల్లి గంగాధర్ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

లెనిన్‌కు ఘన నివాళి

దురాజ్‌పల్లి : కమ్యూనిస్టు విప్లవయోధుడు లెనిన్ 99వ వర్ధంతిని శనివారం సూర్యాపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, అనంతుల మల్లేశ్వరి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, గీత పనివారల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, సూర్యాపేట పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న గన్నా చంద్రశేఖర్ తదితరులు

నేడు మంత్రి పర్యటన

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని కేసారం, కాసరబాద గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రంథాలయం, ఓపెన్ జిమ్ సెంటర్లు, పంచాయతీ కార్యాలయం, పల్లె దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ భిక్షం శనివారం తెలిపారు.